క్లుప్తంగా

సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ ప్రాధాన్యం



నారాయణఖేడ్‌: మాట్లాడుతున్న డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్‌: ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చడమే డ్రైవర్ల లక్ష్యం కావాలని ఖేడ్‌ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య అన్నారు. ఖేడ్‌ ఆర్టీసీ డిపోలో శుక్రవారం డ్రైవర్స్‌ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురిని సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ సురక్షితంగా బస్సులు నడుపుతూ ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. డ్రైవింగ్‌ సమయంలో ఏకాగ్రత ప్రధానమన్నారు. మెకానికల్‌ ఇంజినీరు దశరథరావు, అసిస్టెంట్‌ మేనేజర్‌ నర్సింహులు, సీనియర్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ నందులాల్‌ పాల్గొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ టెస్ట్‌ తప్పనిసరి

ట్రాఫిక్‌ ఎస్‌ఐ ఆంజనేయులు

పటాన్‌చెరు టౌన్‌: స్కూల్‌ నుంచి బస్సు ప్రారంభమయ్యే ముందు యజమాన్యం డ్రైవర్లకు డ్రంకెన్‌ డ్రైవ్‌ టెస్ట్‌ నిర్వహించాలని ట్రాఫిక్‌ ఎస్‌ఐ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పటాన్‌చెరు మండలం ముత్తంగి ఔటర్‌ రింగ్‌ రోడ్డు వద్ద జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్కూల్‌ బస్సులకు ప్రత్యేక డ్రంకెన్‌ డ్రైవ్‌ నిర్వహించారు. పలు ప్రైవేట్‌ స్కూళ్లకు చెందిన 20 బస్సుల డ్రైవర్లకు డ్రంకెన్‌ డ్రైవ్‌ టెస్ట్‌ నిర్వహించారు. మద్యం తాగి స్కూల్‌ బస్సులు నడిపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు కోర్టులో హాజరు పరచడం ద్వారా జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉందన్నారు. డ్రైవర్‌తో పాటు మేనేజ్మెంట్‌ పై కూడా చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్‌ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

కిక్‌ బాక్సింగ్‌లో అత్యుత్తమ ప్రతిభా



జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థి

సంగారెడ్డి : మార్షల్‌ ఆర్ట్స్‌లో పట్టణానికి చెందిన విద్యార్థులు ప్రతిభచాటారు. శుక్రవారం హైదరాబాద్‌లో గల బిర్లా మందిర్‌ సైన్స్‌ మ్యూజియంలో కేశవ్‌ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్నేషనల్‌ రైసింగ్‌ స్టార్‌ మార్షల్‌ ఆర్ట్స్‌లో ఎం. రిత్విక్‌, ఎం.విశ్వేశ్వర్‌లు పాల్గొని పతకాలు సాధించారు. మార్షల్‌ ఆర్ట్స్‌ కు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ శిబిరానికి స్పందన



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

కంది(సంగారెడ్డి): మండల కేంద్రమైన కందిలో నిర్వహించిన శుక్రవారం క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ శిబిరానికి స్పందన వచ్చింది. ఉన్నత్‌ భారత్‌ అభియాన్‌, సెయింట్‌ ఫ్రాన్సిస్‌ కాలేజీ ఆధ్వర్యంలో గ్రేస్‌ ఫౌండేషన్‌ సహకారంతో నిర్వహించారు. వైద్య శిబిరంలో మండలంలోని ఇప్పలగడ్డ తాండ, ఎర్దనూర్‌ తండా, వడ్డెన గూడ తండా, కంది తండా తోపాటు లక్ష్మీనగర్‌కు చెందిన వారికి క్యాన్సర్‌ స్క్రీనింగ్‌ టెస్టులు నిర్వహించారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌ రూపాలి, వైద్యులు పాల్గొన్నారు.

బాలికలు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్‌

సంగారెడ్డి టౌన్‌ : ప్రతీబాలిక ఉన్నత చదువులు చదవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి రమేశ్‌ అన్నారు. శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సంగారెడ్డిలో వేడుకలను నిర్వహించారు. ప్రతీబాలిక ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని ఉన్నతంగా చదువులు చదవాలన్నారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ గాయత్రీదేవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీలబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు



10వ వార్డులో నిర్వహించిన సభలో వినతి స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌

ప్రజాపాలన కార్యక్రమం ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలు అమలు అవుతాయని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌, టీజీఐఐసీ చైర్‌పర్సన్‌ నిర్మల రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సదాశివపేట మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా హాజరైన వారు వినతి పత్రాలు స్వీకరించారు.

– సదాశివపేట(సంగారెడ్డి)



షేర్‌ఖాన్‌పల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికీ రేషన్‌ కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ రైతు భరోసా ఇవ్వాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శుక్రవారం హత్నూర మండలం షేర్‌ ఖాన్‌ పల్లి లో ప్రజా పాలన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. దరఖాస్తు చేసుకొని అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పథకాలను అందించాలన్నారు.

– హత్నూర(సంగారెడ్డి)

కొంగల సందడి



పొలంలో కొంగల సందడి

కొంగలు సందడి చేశాయి. ఒక రైతు తన పొలాన్ని దుక్కి దున్నుతుండగా కొంగలు చుట్టూ చేరాయి. మట్టిలో కనిపించిన పురుగులను ఆరగిస్తూ కనిపించాయి. ఇది చూపరులను ఆకర్షిస్తోంది. అందోల్‌ మండలం కన్‌సాన్‌పల్లి గ్రామశివారులో ఈ దృశ్యం కనిపించింది.

– వట్‌పల్లి (అందోల్‌)

అర్హులను విస్మరించారు

- జాబితాలపై నిలదీతలు
- అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదాలు
- గ్రామసభల్లో వెల్లువెత్తిన నిరసనలు

రాయికోడ్‌(అందోల్‌): మండలంలోని సింగితం గ్రామంలో ప్రజా పాలన గ్రామ సభ రసాభాసగా మారింది. పథకాల అర్హుల వివరాలను అధికారులు చదివి వినిపించారు. దీంతో అనర్హులకు ప్రాధాన్యం ఇచ్చారని గ్రామస్తులు అన్నారు. రుణమాఫీ కాలేదని కొందరు రేషన్‌ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ లబ్ధిదారుల జాబితాలో పేర్లు లేవని ప్రశ్నించారు. కొంతమేరకు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు, నాయకులు, ప్రజలను సముదాయించినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేసి సభ కొనసాగించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మల్లికార్జున్‌ పాటీల్‌, కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షులు నర్సింహులు, నాయకులు శశికాంత్‌, ప్రభాకర్‌, అంబన్న, సల్తా, రఫీ, కేదరినాథ్‌ పాటీల్‌, బీమన్నా, ఎంపీడీఓ ఎంఎం షరీఫ్‌, ఏఓ సారిక, వివిధ శాఖల సిబ్బంది, నాయకులు కాంగ్రెస్‌ సీనియర్‌ నాయకులు సింగితం రాజుకుర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంగ్టిలో..

కంగ్టి(నారాయణఖేడ్‌): ప్రజాపాలన గ్రామసభలో అనర్హులకు పథకాల వర్తింపు విషయంలో అధికారులను స్థానికులు నిలదీశారు. భూమి ఉన్న వారికి సైతం ఆత్మీయ భరోసాలో ఎలా అర్హులుగా నిర్ణయించారని బీఆర్‌ఎస్‌ కార్యకర్తలు ప్రశ్నించారు. దీంతో వారికి, అధికార పక్షానికి మధ్య వాగ్వాదం జరిగింది. రేషన్‌కార్డుల మంజూరు, ఇందిరమ్మ ఇళ్లు సైతం పేదలకు అందలేదని విమర్శించారు. పదేళ్లుగా బీఆర్‌ఎస్‌ ఏం చేసిందని అధికార పక్షం నాయకులు నిలదీశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. పోలీసులు.. ఇరు పక్షాలను శాంతింపజేశారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి విజయ్‌భాస్కర్‌, మండల ప్రత్యేకాధికారి నూతన్‌కుమార్‌, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాస్‌రావు, ఏఈఓ హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ టవర్‌ ఎక్కేందుకు యత్నం

- లక్ష్మీనగర్‌ వాసి నిరసన
- అర్హుల జాబితాలో పేరు లేదని ఆవేదన



యువకుడిని అడ్డుకుంటున్న పోలీసులు

కంది(సంగారెడ్డి): అర్హుల జాబితాలో తన పేరు రాలేదని యువకుడు సెల్‌ టవర్‌ ఎక్కేందుకు యత్నించాడు. కంది లక్ష్మీనగర్‌కు చెందిన మహమ్మద్‌ గ్రామసభలో తన పేరు రానందుకు ఈ ప్రయత్నం చేశాడు. ఇక్కడే ఉన్న స్థానికులు, పోలీసులు అడ్డుకున్నారు. ఈ సభల్లో మరలా దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు సూచించారు.

అందరికీ సంక్షేమ ఫలాలు : టీజీఐఐసీ చైర్‌ పర్సన్‌ నిర్మల

పథకాలు అర్హులైన వారందరికీ అందించేందుకు గ్రామసభలు నిర్వహిస్తామని తెలంగాణ ఇండస్ట్రియల్‌ డెవలప్మెంట్‌ చైర్‌ పర్సన్‌ నిర్మల అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కందిలో నిర్వహించిన గ్రామ సభలో ఆమె మాట్లాడుతూ ఈ గ్రామ సభల్లో అర్హులను ఎంపిక చేస్తున్నారన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని తెలిపారు. ఎవరైనా కొత్త రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోకుండా ఉంటే ఈ గ్రామసభల్లో దరఖాస్తులు అధికారులకు అందజేయొచ్చన్నారు. రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు నిరంతరం కొనసాగుతుందన్నారు. ఎంపీడీఓ శ్రీనివాస్‌, ఎంపీఓ మహేందర్‌ రెడ్డి, విద్యాదర్‌ గౌడ్‌, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంగారెడ్డిటౌన్‌లో..

సంగారెడ్డి టౌన్‌ : మండలంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందించాలని సంగారెడ్డి ఎంపీడీఓ యాదగిరి అన్నారు. శుక్రవారం సంగారెడ్డి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రజలందరికీ రైతు భరోసా, ఆత్మీయ భరోసా, రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గ్రామసభలో ఎంపిక చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతాయన్నారు. కార్యక్రమంలో మండలాధికారులు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

9వ వార్డులో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శుక్రవారం ప్రజాపాలన వార్డు సభ నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ సంగారెడ్డి, తహసీల్దార్‌ సంగ్రామ్‌ రెడ్డి పాల్గొన్నారు. స్థానిక ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అర్హులైన ప్రతీఒక్కరికి తెల్లరేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని కౌన్సిలర్‌ మంజుల అధికారులను కోరారు. కార్యక్రమంలో తెల్లాపూర్‌ సొసైటీ చైర్మన్‌ బుచ్చిరెడ్డి, ఆర్‌ఐ శ్రీకాంత్‌ పాల్గొన్నారు.



రాయికోడ్‌: వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్‌ సంగ్రామ్‌రెడ్డి

మరోసారి దరఖాస్తు చేసుకోవచ్చు

హత్నూర(సంగారెడ్డి): పేర్లు లిస్టులో రాలేవని పలు గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అధికారుల తీరుపై లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దౌల్తాబాద్‌ సభలో జిల్లా పరిషత్‌ డిప్యూటీ సీఈఓ స్వప్న పాల్గొన్నారు. అర్హులైనప్పటికీ లిస్ట్‌లో తమ ఎందుకు పేరు లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లిస్ట్‌లో మాత్రం కొంత మంది పేర్లు మాత్రమే వచ్చాయన్నారు. రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పడంతో ఆందోళన విరమించారు.

జహీరాబాద్‌లో.. ..

జహీరాబాద్‌: అర్హులైన వారందరికీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను అందజేస్తుందని ఏడీఏ, మండల స్పెషలాఫీసర్‌ భిక్షపతి అన్నారు. శుక్రవారం మండలంలోని సత్వార్‌లో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వం అందించే ప్రజా సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ అందుతాయన్నారు. ఈ విషయంలో ప్రజలు ఏ మాత్రం ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ మాణిక్‌రెడ్డి, పీఏసీఎస్‌ చైర్మన్‌ కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

జిన్నారంలో..

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో 1, 2, 7, 9వ వార్డులలో ప్రజాపాలన వార్డు సభలను మున్సిపల్‌ అధికారులు శుక్రవారం నిర్వహించారు. ఆయా వార్డుల సమక్షంలో మున్సిపల్‌ కమిషనర్‌ మంగతాయారు సమగ్ర ఇంటింటి కుటుంబ, ఆహార భద్రతా కార్డు, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలపై ప్రజాపాలనలో అర్హుల జాబితాను అధికారులు సభలో చదివి వినిపించారు. సభ ఆమోదం పొందిన నివేదికలను కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు. ఇప్పటి వరకు 2,115 ఆహార భద్రతా కార్డులు, 1562 ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో నర్సింహులు, కౌన్సిలర్లు చంద్రమ్మ, గోపాలమ్మ, సతీశ్‌, బీరప్ప యాదవ్‌, కార్యాలయ సిబ్బంది, స్థానికులు దరఖాస్తుదారులు పాల్గొన్నారు.



హత్నూర: కొన్యాలలో ఆందోళన చేస్తున్న ప్రజలు

ఝరాసంగంలో..

ఝరాసంగం(జహీరాబాద్‌): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలు అర్హులైన వారికీ అందజేస్తామని ట్రైనీ కలెక్టర్‌ మనోజ్‌ వెల్లడించారు. శుక్రవారంతో గ్రామసభలు ముగిశాయి. చివరి రోజు మండలంలోని కుప్పానగర్‌లో నిర్వహించిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. జాబితాలో పేరు లేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహన దారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్‌ సీఐ లాలూ నాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... గురువారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌ లో 16 మందిని పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడిన వాహన దారులను శుక్రవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా 13 మందికి రూ. 1500 జరిమానా, అదేవిధంగా ఒకరికి రూ. 2 వేలు, మరో ఇద్దరికి రూ .వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

29 నుంచి క్రికెట్‌ టోర్నీ

వట్‌పల్లి(అందోల్‌): వట్‌పల్లి లయన్స్‌ క్లబ్‌, సంగారెడ్డి హోప్‌ న్యూరో హాస్పిటల్‌ నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్‌ టోర్నమెంట్‌ ఈనెల 29 నుంచి వట్‌పల్లిలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు లయన్స్‌ క్లబ్‌ అధ్యక్షుడు మోయినోద్దీన్‌, కె. పెద్దన్న తెలిపారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని, వారిని ప్రోత్సహించేందుకే పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీమ్యాచ్‌కు ఎనిమిది ఓవర్లు మాత్రమే ఉంటుందన్నారు. ఈనెల 28న డ్రా తీయబడుతుందని, ఎంట్రీ ఫీజు రూ.1500 చెల్లించి టీంలు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. వివరాల కోసం 99518-63746, 94908-66326 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అబద్ధాలతో వంచన

కాంగ్రెస్‌ పార్టీపై మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ మండిపాటు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌

జోగిపేట(అందోల్‌): రుణమాఫీ పూర్తి స్థాయిలో జరగలేదని మంత్రి దామోదర రాజనర్సింహ చెప్పారని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్‌ అన్నారు. శుక్రవారం అందోల్‌లోని ప్రైవేట్‌ ఫంక్షన్‌ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ విషయంలో ప్రజల ఒత్తిడికి తలొగ్గే మంత్రి వాస్తవాలు అంగీకరించారన్నారు. రుణమాఫీ అందరికీ జరగలేదని కొన్ని నెలలుగా కేటీఆర్‌, హరీశ్‌రావులతో పాటు తామంతా చెబుతూనే ఉన్నా ప్రతిపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయంటూ ఎదురుదాడికి పూనుకున్నారన్నారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి తో పాటు అందరూ మంత్రులు అబద్ధాలతో ప్రజలను నమ్మించారని విమర్శించారు. నియోజకవర్గంలో జరుగుతున్న గ్రామసభలు అన్ని కూడా ప్రజలతో సంబంధం లేకుండా కాంగ్రెస్‌ సభలుగానే జరుగుతున్నాయని విమర్శించారు. లబ్ధిదారుల ఎంపికలో అనర్హులను ఎంపిక చేసి అసలు లబ్ధిదారులకు మోసం చేశారని ఆరోపించారు. ఇప్పటివరకు లబ్ధి పొందని వారిని గుర్తించి ఎంపిక చేయాలన్నారు. గ్రామసభల్లో ఎక్కడా కూడా ప్రొటోకాల్‌ పాటించకుండా కాంగ్రెస్‌ గ్రామ అధ్యక్షులను మండల పార్టీ అధ్యక్షులను సభకు అధ్యక్షులుగా కూర్చోబెట్టి సభలను నడుపుతుందన్నారు. డీసీసీబీ మాజీ వైస్‌ చైర్మన్‌ జైపాల్‌ రెడ్డి, మాజీ ఎంపీపీ పీ రామాగౌడ్‌, ఏఎంసీ మాజీ చైర్మన్‌ నాగభూషణం అందోల్‌, మునిపల్లి మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీకాంత్‌ రెడ్డి, ఎం.విజయ్‌కుమార్‌, మాజీ పట్టణ అధ్యక్షుడు చాపల వెంకటేశం, మండల యూత్‌ అధ్యక్షుడు అనిల్‌రెడ్డి, సీనియర్‌ నాయకులు మాణిక్‌ రెడ్డి, వీరేశం, మొగులయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జడ్జి సూరికృష్ణ



మాట్లాడుతున్న సీనియర్‌ సివిల్‌ జడ్జి సూరికృష్ణ

జహీరాబాద్‌: చట్టాల గురించి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సీనియర్‌ సివిల్‌ జడ్జి సూరికృష్ణ అన్నారు. శుక్రవారం జహీరాబాద్‌లోని మైనార్టీ బాలికల కళాశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతీవిద్యార్థి చక్కగా చదువుకోవాలని, చదువుతో పాటు సాధారణ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నిత్య జీవితంలో చిన్న చిన్న సమస్యలు ఎదురు కాకుండా ఉండడానికి, ఒక వేళ సమస్యలు వస్తే వాటిని అధిగమించడానికి చట్టాలు తోడ్పాటు అందిస్తాయని సూచించారు. సదస్సులో సమాచార హక్కు చట్టం, మోటారు వాహనాల చట్టం, బాలకార్మికుల నిర్మూలన చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం, జువైనైల్‌ జస్టిస్‌ యాక్టు, ఉచిత న్యాయ సేవా సహాయంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గోపాల్‌, న్యాయవాదులు విజయ్‌కుమార్‌, రుద్రయ్యస్వామి, మాణెన్న, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

యువతకు శిక్షణ తరగతులు

- త్వరలో నాగల్‌గిద్దలో కొత్త పోలీస్‌స్టేషన్‌ భవన నిర్మాణం
- ఎస్పీ చెన్నూరి రూపేశ్‌



పోలీసు ఔట్‌ పోస్టు భవనం ప్రారంభిస్తున్న ఎంపీ షెట్కార్‌, ఎమ్మెల్యే సంజీవరెడ్డి, ఎస్పీ రూపేశ్‌

నారాయణఖేడ్‌: నిరుద్యోగ యువతకు పోలీసు శాఖతోపాటు అనుబంధ శాఖల్లో ఉద్యోగాలు సాధించేలా వేసవిలో నారాయణఖేడ్‌లో పోలీసు శాఖ తరఫున శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎస్పీ చెన్నూరి రూపేశ్‌ తెలిపారు. నాగల్‌గిద్ద మండలం మోర్గి క్రాస్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన పోలీసు ఔట్‌పోస్టు, తాత్కాలిక పోలీస్‌స్టేషన్‌ భవనాన్ని ఎంపీ సురేష్‌ షెట్కార్‌, ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డిలతో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పోలీసుశాఖ నిర్వహించిన ఉద్యోగ నియామకాల్లో జిల్లాలోనే అత్యధికంగా ఖేడ్‌ ప్రాంతం నుంచి సుమారు 180మంది వరకు ఉద్యోగ అవకాశాలు పొందారని తెలిపారు. యువతకు పోలీసు, సీఆర్‌పీఎఫ్‌, ఆర్మీ తదితర రంగాల్లో ఉద్యోగాలు పొందేందుకు అనువుగా ఉండేందుకు ఇక్కడ ఏర్పాటు చేయనున్న శిక్షణను యువతకు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నాగల్‌గిద్దలో త్వరలో కొత్త పోలీస్‌స్టేషన్‌ భవనం నిర్మాణం చేస్తామన్నారు. ఎంపీ సురేశ్‌ షెట్కార్‌, ఎమ్మెల్యే డాక్టర్‌ సంజీవరెడ్డిలు మాట్లాడారు. ప్రాంతంలోని నూతన పోలీస్‌స్టేషన్‌ భవనాల నిర్మాణాలకు తమ నిధులను కూడా కేటాయించి నిర్మాణాలు జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. మోర్గిలో నిర్మించిన ఈ భవనం ఔట్‌ పోస్టుగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ సంజీవ్‌, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, నాగల్‌గిద్ద, ఖేడ్‌ ఎస్‌ఐలు సాయిలు, శ్రీశైలం, మాజీ జిల్లా కోఆప్షన్‌ సభ్యులు రషీద్‌, పీసీసీ సభ్యులు శంకరయ్యస్వామి, రమేశ్‌ చౌహాన్‌, రాకేశ్‌ షెట్కార్‌, శ్రీకాంత్‌, మాణిక్‌రావు, గుండేరావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.2.80కోట్ల పనులకు శంకుస్థాపన

సదాశివపేట(సంగారెడ్డి): సదాశివపేట మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ పేర్కొన్నారు. మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ అపర్ణ, వైస్‌ చైర్మన్‌ చింత గోపాల్‌తో కలసి ఆయన శుక్రవారం సదాశివపేట పట్టణంలో సదాశివ ఎంక్లేవ్‌ కాలనీ, బసవేశ్వర మందిరం ప్రాంతాల్లోని వార్డుల్లో రూ.2.80కోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్‌ కమిషనర్‌ ఉమా, ఇంజనీర్‌ రాజేశ్వర్‌, కౌన్సిలర్‌ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బీఆర్‌ఎస్‌లో చేరికలు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం బోర్పట్లకి చెందిన యువకులు ఎమ్మెల్యే సునీతారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో శుక్రవారం చేరారు. 20 మంది యువకులతో కలిసి తెలంగాణ ఉద్యమకారుడు దివంగత కొప్పు నరసింహులు కుమారుడు కొప్పు పవన్‌ కళ్యాణ్‌ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీకాంత్‌, నర్సింహులు యువకులు పాల్గొన్నారు.

◆ ఏఈఓకు నేతాజీ అవార్డు ప్రదానం

జహీరాబాద్‌ టౌన్‌: ఏఈఓ నేతాజీ అవార్డు ప్రదానం పొందారు. జహీరాబాద్‌ మండలం రంజోల్‌ వ్యవసాయ విస్తీర్ణ అధికారి (ఏఈఓ) ప్రదీప్‌ కుమార్‌కు హైదరాబాద్‌ శ్రీకొమ్మూరి చారిటబుల్‌ ట్రస్టు వారు నేతాజీ సుభాష్‌ చంద్రబోస్‌ లైఫ్‌ టైం అచీవ్మెంట్‌ అవార్డు ప్రదానం చేశారు. విశిష్ట ప్రతిభా పురస్కారాల కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. ఆయన సేవలను గుర్తించిన ట్రస్టు చైర్మన్‌ శ్రీనివాస్‌ జైపాల్‌, డీజీపీ రాందాస్‌లు ఆయనకు ప్రశంసా పత్రంతో పాటు అవార్డు అందజేశారు.

◆ గుమ్మడిదలలో సంవిధాన్‌ గౌరవ్‌ అభియాన్‌

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మండలకేంద్రంలోని దళితవాడలో ప్రధాని మోదీ ఆదేశాల అనుగుణంగా బీజేపీ మండల అధ్యక్షుడు కావలి ఐలయ్య ఆధ్వర్యంలో సంవిధాన్‌ గౌరవ్‌ అభియాన్‌ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి భారత రాజ్యాంగ విశిష్టత గురించి తెలుపుతున్నారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు ముత్యాలు గౌడ్‌, ఉదయ్‌ కుమార్‌, సంజీవ, రాజు, నరసింహ, సత్యనారాయణ, రామ్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రయాణికులకు భద్రత భరోసా కల్పించాలి

జహీరాబాద్‌ టౌన్‌: ప్రతీప్రయాణికుడికి భద్రత, భరోసా కల్పిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని జహీరాబాద్‌ ఎంవీఐ వెంకటయ్య ఆర్టీసీ డ్రైవర్లకు సూచించారు. స్థానిక డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఆర్టీసీ డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటారన్నారు. అయినా నిబంధనలు పాటిస్తూ విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్‌ టౌన్‌ ఎస్‌ఐ కాశీనాథ్‌, డిపో మేనేజర్‌ జాకీర్‌ హుసేన్‌ తదితరులు పాల్గొన్నారు. ప్రమాద రహిత డ్రైవర్లను సన్మానించి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు.

◆ నాణ్యమైన విద్యాబోధన చేయాలి

కల్హేర్‌(నారాయణఖేడ్‌): విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని డీఈఓ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం మండలంలోని మార్డిలో జెడ్పీహెచ్‌ఎస్‌, ఎంపీఎస్‌ పాఠశాలలు తనిఖీ చేశారు. టీచర్లతో మాట్లాడి బోధన గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌, హెచ్‌ఎంలు గుండు లక్ష్మణ్‌, దేవిసింగ్‌ పాల్గొన్నారు.

◆ లక్నో ఐజీని కలిసిన పీఠాధిపతి

ఝరాసంగం(జహీరాబాద్‌): లక్నో ఐజీ రవీందర్‌ను దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి 108 వైరాగ్య శిఖామని అవధూత గిరి మహరాజ్‌ కలిశారు. ప్రయాగరాజ్‌ కుంభమేళాకు వెళ్లిన పీఠాధిపతి ఐజీని కలిసి పూలమాల శాలువాతో సన్మానించి, ఆశీర్వదించారు.

గురుకులంలో బస



విద్యార్థినులతో మాట్లాడుతున్న వర్షిణి

గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి శుక్రవారం అందోల్‌ మండల కేంద్రంలో ఉన్న సాంఘిక సంక్షేమ ప్రభుత్వ గురుకులాల బాలికల పాఠశాలలో శుక్రవారం బస చేశారు. రాత్రంతా పాఠశాలలోనే ఉండి, విద్యార్థులతో కలిసి గడిపారు. ప్రభుత్వ విద్యావిధానాలు ఎంత వరకు అమలవుతున్నాయో తెలుసుకోవడానికి ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.

– జోగిపేట(అందోల్‌)